క్లుప్తంగా

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆదివారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతోందని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు సత్యనారాయణతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షులు బీచ్యానాయక్ ఉన్నారు.

కిషన్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ఆదివారం ఇబ్రహీంపట్నంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కిషన్‌రెడ్డిని నాలుగోసారి గెలిపిస్తే.. మంత్రి అవుతారని ఓటర్లకు చెబుతూ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు జెర్కొని రాజు, కొండ్రు ప్రవీణ్, శివసాయి, నిట్టు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన బాలమ్మ ఇటీవల మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను ఆదివారం కోనాపూర్ గ్రామానికి చెందిన భగత్‌సింగ్ కారు డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబసభ్యులకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ కారు డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న యువకులు

కడ్తాల్: మండల పరిధిలోని రేఖ్యాతాండకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు గిరిజన యువకులు ఆదివారం కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. రేఖ్యతండాకు చెందిన శ్రీకాంత్, హరి, శ్రీనివాస్, శ్రీను, పరమేశ్, గోపి, గణేశ్, అనిల్‌తో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలో ఆచారి ఆహ్వానించారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి సాయిలాల్‌నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు వీరయ్య, డాక్టర్ రమేశ్, రాందాస్, శ్రీకాంత్ ఉన్నారు.

బీఎస్పీతోనే అందరికీ మేలు

కొత్త మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల మేలు కోరేది ఒక్క బీఎస్పీ పార్టీ మాత్రమేనని మహేశ్వరం నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు టికెట్ కేటాయించినందుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానికేతరులకు ఈ ఎన్నికల్లో డిపాజిట్ దక్కదని, స్థానికుడినైన తనను గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లింగం, ఇన్‌చార్జి మహేశ్‌చారి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా కన్వీనర్ ఇందుమతి, స్వప్నయాదవ్, ఎన్.నర్సింహ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విలువల రాజకీయమే ఎజెండా

- అన్ని వర్గాలకు ప్రాధాన్యత
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దా
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటువేయండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు

యాచారం: రాజకీయాల్లో మొదటి నుంచి విలువలతో కూడిన రాజకీయాలు చేశానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచానని, పదవిలో ఉన్న రోజుల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. ఎన్నికలప్పుడు తప్పా మిగితా సమయాల్లో రాజకీయాలు చేయలేదని చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో పలువురు వార్డు సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.3వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే ఏర్పాటయ్యేలా కృషి చేశానని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తనకు ఓట్లేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, నాయకులు యాదయ్య, పాండుగౌడ్, శివ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాగన్నగూడలోని సూరజ్‌నగర్‌లో పలువురు మంచిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే



ఓటుయాలని అభ్యర్థిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

- కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లో వివిధ గ్రామాల్లో ఆదివారం కసిరెడ్డి నారాయణరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నియంత, అవినీతి, అరాచక పాలనకు ముగింపు పలికేందుకు ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తుందని తెలిపారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో కసిరెడ్డికి మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పసుపుల మానయ్య, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, ఖాదర్, భాస్కర్, అలీం, నాజర్, ఫరీద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు కాంగ్రెస్ వైపే

తలకొండపల్లి: అందరి చూపు కాంగ్రెస్ వైపే ఉందని, కల్వకుర్తిలో జెండా ఎగురవేస్తామని కసిరెడ్డి నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఖానాపూర్‌లోని కసిరెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, అందువల్ల కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని, అధిక సీట్లు కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను పక్కగా అమలు చేస్తామని ప్రకటించారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఐకమత్యంతో పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి, కుమార్, శ్రీనివాసురెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగం, వెంకటయ్య పాల్గొన్నారు.



నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కల్వకుర్తిలో గులాబీ జెండా ఎగురవేద్దాం



ప్రజలకు అభివాదం చేస్తున్న జైపాల్‌యాదవ్

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కడ్తాల్‌లో భారీ ర్యాలీ

కడ్తాల్: కల్వకుర్తి గడ్డపై గులాబీ జెండాను మరోసారి ఎగురవేద్దామని కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు బయలుదేరుతూ.. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఐదేళ్లుగా కనబడని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కల్లబొల్లి మాటలు చెప్పడానికి ప్రజల వద్దకు వస్తున్నారని, ఆ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ తదితర పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే తిరిగి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ఆమనగల్లు సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, ఉన్నారు.

కష్టపడ్డ వారికి సముచిత స్థానం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



బూత్ కమిటీతో శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని, అధికారంలోకి రాగానే వారికి సముచిత స్థానం కల్పిస్తామని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం కడ్తాల్ గ్రామ కాంగ్రెస్ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా మంకి శ్రీనుతో పాటు 20 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు పెంటయ్య, ముత్తికృష్ణ, మహేశ్, వీరరాఘవులు, వెంకటరమణ, రామకృష్ణ, చందు, కృష్ణ ఉన్నారు.

బహుజన రాజ్యంతోనే అభివృద్ధి



ప్రచారంలో చేస్తున్న బీఎస్పీ నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండలంలోని అందుగుల గ్రామంలో బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ బహుజన రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. కల్వకుర్తి బీఎస్పీ అభ్యర్థి కొమ్ము శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు సురేశ్, మండల అధ్యక్షుడు కొండల్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఇబ్రహీంపట్నం: రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఆదివారం స్కూటర్‌ను బొలోరా వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కప్పపహాడ్ గ్రామానికి చెందిన దేవరకొండ నర్సింహ (48) స్కూటర్‌పై ఇబ్రహీంపట్నం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బుగ్గ రాములు అనే వ్యక్తి బొలేరా వాహనంలో ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్నాడు. చర్లపటేల్‌గూడ రహదారిలోని దర్గా సమీపంలో స్కూటర్‌ను బొలోరా ఢీ కొట్టడంతో నర్సింహకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆటోను ఢీ కొట్టిన డీసీఎం

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్‌హెచ్ఓ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌దాస్ కృష్ణయ్య(45) ముద్విన్ గ్రామంలో జామతోట సాగుచేసేవాడు. ఇందులో భాగంగా ఉదయం భార్య సుజాత, కుమారుడు విజయ్‌కుమార్‌తో కలిసి తోటకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని టోల్ ప్లాజా వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న డీసీఎం వాహనం ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణయ్యను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య భార్య సుజాత, కుమారుడు విజయ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శివప్రసాద్ తెలిపారు.



కృష్ణయ్య(ఫైల్)

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి

మహేశ్వరం: ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని బెల్లం పానకం ధ్వంసం చేశామని మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాలు, గిరిజన తండాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, నాటు సారా, బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదివారం నిర్వహించిన దాడుల్లో 1,600 లీటర్ల బెల్లం పానకం, 18 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా మద్యాన్ని నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే.. టోల్ ఫ్రీ నంబర్ 18004252523 కి లేదా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8112658745, ఎస్‌ఐ 9177136740, 9640412156 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు హన్మంతు నాయక్, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో కొంగర కలాన్‌కు మహర్దశ



ప్రచారం నిర్వహిస్తున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో కొంగర కలాన్ ప్రాంతం రూపురేఖలు మారుతున్నాయని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొంగర కలాన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. అందులో భాగంగానే కొంగర కలాన్‌కు బహుళజాతి కంపెనీలు వచ్చాయని తెలిపారు. అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రతి ఇంటికి లభిస్తాయన్నారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమర్థనాయకత్వంలో పరిశ్రమలు తరలివస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపగళ్ల మహేందర్, వనం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ముక్కెర నారాయణ, వీరస్వామిగౌడ్, శ్రీనివాస్, విద్యాసాగర్, మధు, సంతోశ్ పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటేయండి

యాచారం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం మరితం అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. ఆదివారం నల్లవెల్లి, నక్కర్తమేడిపల్లి, అయ్యవారిగూడెం, మాల్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి యాదయ్యగౌడ్, జిల్లా రాములు, లక్ష్మీపతిగౌడ్ ఉన్నారు.

ప్రచార హోరు.. చేరికల జోరు



ప్రయాణికులను ఓట్లు అభ్యర్థిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆరు గ్యారంటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అనురాధ తదితరులు

- ప్రజల్లోకి విస్తృతంగా ఆరు గ్యారంటీలు
- రాజకీయ క్షేత్రంలోకి కాంగ్రెస్ శ్రేణులు
- నియోజకవర్గంలో జోరుగా ప్రచారం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో దూసుకుపోతున్నారు. పల్లెలు, పట్టణాల్లో ప్రచార హోరును పెంచారు. గడపగడపకూ వెళ్లి అభ్యర్థుల తరపున ఓట్లు అడుగుతున్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ.. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మరోవైపు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకుంటూ బలాన్ని పెంచుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని పలు వార్డుల్లో కలియతిరుగుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు.

బస్సు ఎక్కి..

ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులను ఓట్లు వేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చందు, శశిధరప్ప, సోమప్ప, నరహరి పలువురు ఉన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో చేరారు. కండువాలు కప్పి వారికి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తోనే న్యాయం

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మాజీ జెడ్పీటీసీ పొట్టి ఐలయ్య, పంబుల్ల శ్రీనివాస్‌రెడ్డి, రామారావుకు మల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌కు చెందిన బీఆర్‌ఎస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలంటే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కొద్ది రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ అరాచక, అవినీతి పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు లావణ్య, మౌనిక, అర్చన, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంచాల: మంచాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మంచాల మాజీ మండల ఉపాధ్యక్షుడు ఆవుల మల్లేశ్, జెనిగె వెంకటేశ్, చెన్నారెడ్డి గూడ సర్పంచ్ కిషన్ నాయక్, ఉప సర్పంచ్ పిడుగు పరమేశ్‌తో పాటు చెన్నారెడ్డిగూడ, జాపాల, అస్మత్‌పూర్ గ్రామాలకు పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, లక్ష్మణ్, దేవేందర్, భాస్కర్, రమేశ్, శ్రీను, రాజు, లాలు నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేస్తాం

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆదివారం తుర్కయంజాల్‌లోని గంగిరెడ్డి కాలనీలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు గుడ్ల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

యాచారం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీనవర్గాలకు మేలు జరుగుతుందని, హస్తం గుర్తుకు ఓట్లేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని యాచారం మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి కోరారు. యాచారం గ్రామంలోని ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే గునుగల్ గ్రామంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. తాడిపర్తి గ్రామంలో సర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఫార్మాసిటీ రద్దు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, అందువల్ల మల్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్‌రెడ్డి, రామారావు